క్లుప్తంగా

ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలి



నిరుపయోగంగా ఉన్న ట్యాంక్‌ను చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డు పద్మావతి నగర్‌లో గత నెలరోజులుగా ట్యాంక్ నుంచి నీరు రావడం లేదని, ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలని సీపీఎం నగర నాయకులు యేసు డిమాండ్ చేశారు. వేసవి కాలం కావడంతో ట్యాంక్ నుంచి నీళ్లు వస్తే కాలనీ వాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సీపీఎం నాయకులు తిమ్మప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా


బోల్తాపడిన మినీ లారీ

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం లారీ బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి స్ప్రైట్ బాటిళ్ల లోడ్‌తో మినీ లారీ బేతంచెర్లకు బయలుదేరింది. మినీ లారీ కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఓర్వకల్లు సమీపాన తిప్పాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద ముందుగా వెళుతున్న ఆటోను తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కురుమూర్తి చేతికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి లారీని పక్కకు తరలించారు. గాయపడిన డ్రైవర్ కురుమూర్తిని చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలుకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు విరాళం


విరాళం అందిస్తున్న దాత

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.3 లక్షల విరాళం అందించారని ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిలో భాగంగా ముచ్చుమర్రి కాటం రఘునాథరెడ్డి, శిల్పల కుమారుడు సూర్యచంద్రారెడ్డి రూ.లక్ష, తాటిపాడు గ్రామానికి చెందిన రాయపు రామచంద్రారెడ్డి, శృతిల కుమార్తె సాన్వి రూ.లక్ష, అలాగే పారుమంచాల గ్రామానికి చెందిన మండడి సుబ్బారెడ్డి, సూర్యకళావ తమ్మల కుమారుడు నరేంద్రనాథ్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారన్నారు. ఈ నగదును కాంట్రాక్టర్‌కు చెల్లించడం జరిగిందన్నారు. అనంతరం దాతలచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి, శేషవస్త్రాలు అందించినట్లు తెలిపారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహించి ప్రజలను ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

'దేవుడా' శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలుగు సారస్వత వైభవం ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాలస్వామి రచించిన 'దేవుడా' శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు సారస్వత వైభవం అధ్యక్షుడు గొర్రెడ్డి హరిశ్చంద్రారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ.. మంచి రచనల ద్వారా సంస్కార వంతులైన యువతను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీశ్రీ లాంటి మహనీయుల రచనలు నేటి సమాజానికి ఆదర్శం కావాలన్నారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు, పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయ శాఖ
- ఈ ఏడాది లక్ష్యం 696 మట్టి పరీక్షలు


ఒండుట్లలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది


మంచాలకట్టలో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

గడివేముల: పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో లేవో తెలుసుకోకుండానే ఎంతో మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు. మండలంలోని 21 గ్రామాల్లో రైతులు 10164 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలో 696 మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మే 15వ తేదీలోగా శ్యాంపిల్స్ సేకరణ పూర్తి చేసేందుకు రైతుసేవా కేంద్రాల సిబ్బంది కృషి చేస్తున్నారు.

పంట సాగు చేసేముందు ప్రతి రైతు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించుకోవాలి. పంట కోత ముగిసిన నెల రోజుల తర్వాత మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట సాగు చేసేందుకు నేల అనుకూలంగా ఉందో తెలుస్తుంది. రసాయన ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల భూమికి రక్షగా ఉంటుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబరులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. అనువైన సమయంలో భూసార పరీక్ష చేయించడం ఉత్తమమని సూచిస్తున్నారు.

ఇష్టానుసారంగా రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సమయాత్తమైంది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. విత్తనం వేసే ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షల విధానంలో కూడా కొత్త పద్ధతులను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో..

ఎరువుల వినియోగంలో అనవసర ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి.

సూర్యరశ్మి పోషకాలే కీలకం

పంటల సాగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్లే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్ ఎక్కువగా వాడటం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము, వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు పీహెచ్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం, సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది.

భూమిలో సేంద్రీయ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.2 శాతం వరకు ఉన్నట్టు గత పరీక్షల నివేదికల ద్వారా అధికారులు గుర్తించారు. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసా ర పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసా య శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టి నమూనా సేకరించే విధానంపై వీఏఏలు, ఏఓలకు వ్యవసాయ శాఖ జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 696 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా మే 15వ నాటికి లక్ష్యం మేరకు సమూనాలను పరీక్షించాలని నిర్దేశించగా, ఇప్పటి మండలంలో వంద మట్టి నమూనాలు సేకరించారు.

రైతులకు అవగాహన కల్పించాం



ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మట్టి పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి నత్రజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం లభ్య పోషకాల స్థాయిని లెక్కిస్తారు. వాటి ఫలితాలను బట్టి రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తే మంచిది. భూసార పరీక్షలపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం.

– రమేష్, వీఏఏ, గడిగరేవుల

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

సి.బెళగల్: మండల ప్రజలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఇళ్ల స్థలాలు లేని గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించి వివరాలను నామోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

చదరంగంతో మేధస్సు

కర్నూలు(అగ్రికల్చర్): మేధస్సుతో కూడిన ఆట చదరంగం అని, ఇందులో ప్రతిఒక్కరూ రాణించవచ్చని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ తెలిపారు. ఆదివారం కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని జగదీష్‌మాల్‌లో కర్నూలు చెస్ అకాడమీని సీఐ శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలతో చదరంగం(చెస్) ఆడి అలరించారు. చదరంగంలో రాణించాలంటే పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఈ ఆట మనలోని మేధస్సును వెలికి తీస్తుందని చెప్పారు. చిన్నారులు మొదలుకొని ప్రతి ఒక్కరూ ఇష్టంగా ఆడదగినది చెస్ మాత్రమేనని పేర్కొన్నారు. చెస్ అకాడమీని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ చంద్రశేఖర్‌నాయక్, మహేంద్రనాయక్, చెస్ అకాడమీ ప్రతినిధులు విజయమనోహర్, సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు

- 11న స్వామివారి కల్యాణం, రథోత్సవం



ముడుమలగుర్తిలోని నవరత్నాల లక్ష్మీనరసింహస్వామి, రథోత్సవానికి సిద్ధం చేస్తున్న స్వామివారి రథం

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన నవరత్నాల లక్ష్మీ నరసింహ ఈరన్నస్వామి ఉత్సవాలను ఈనెల 8వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భక్త బృందం సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 8న అంకురార్పణ, గణపతి పూజ, స్వామి వారికి అభిషేకం, 9న ప్రభోత్సవం, 10న కలశపూజ, వాస్తుపూజ, అభిషేకం, శ్రీభూదేవి ఊరేగింపు, 11న గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకం, అభిజిత్ లగ్నంలో స్వామి అమ్మవార్ల కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 12న నందికోలసేవ, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ పూజారి రంగన్న స్వామి తెలిపారు.

ఆటల పోటీలు

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని 11వ తేదీ సాయంత్రం చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే 12వ తేదీ మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన మహిళలకు దాతల సహకారంతో మొదటి బహుమతిగా రూ.3 వేలు, 2వ బహుమతిగా రూ.2వేలు, 3వ బహుమతిగా రూ.1000 బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

12న బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12వ తేదీ గ్రామ పెద్దలు, భక్తబందం సభ్యుల సహకారంతో ముడుమలగుర్తి గ్రామంలో 6పాలవండ్ల ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి నాలుగు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

రమణీయం.. వేంకటేశ్వరుని రథోత్సవం

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ గ్రామంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వాముల వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లె నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ తదితరులు శనివారం రాత్రి రథాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శశిధర్‌శర్మ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, రథోత్సవానికి సిద్ధం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టింపజేసి భాజాభజంత్రీలు, డప్పుల మధ్య రథశాల వద్దకు చేర్చారు. రథశాల వద్ద క్రతువులు పోసి రథాంగహోమం, కుష్మాండబలి సమర్పించి స్వాముల వారిని రథంపైకి చేర్చారు. అశేష భక్తజన సందోహం మధ్య తరలిపోతున్న రథంపైకి భక్తులు పూలు, పండ్లు విసురుతూ కరచాల ధ్వనులతో గోవింద నామస్మరణ చేశారు. అనంతరం స్వాముల వారి రథాన్ని ముందుకు కదిలించి, స్థానిక సుంకులమ్మ గుడి వరకు వెళ్లిన రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న 'ఉట్ల' ప్రదర్శన

వేంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా అనాదిగా వస్తున్న ×ఉట్ల₹ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కుమ్మరి కులస్తులు వెదురు బొంగులకు వేలాడదీసిన ఉట్లపై కుండలను ఉంచుతారు. యాదవ కులస్తులు వేలాడుతున్న కుండలను కర్రలతో కొడుతుండగా కుమ్మరి వాళ్లు కుండలకు తగలకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తారు. చివరకు యాదవులే జయిస్తారు. స్థానిక కృష్ణుడి దేవాలయం, రథశాల, వీరభద్రస్వామి దేవాలయం వద్ద ఉట్ల ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరి, ఎద్దుల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 10 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా, అక్కెంపల్లెకు చెందిన కోనేపల్లె ఇంద్రారెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని 4800 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.50 వేలను కై వసం చేసుకున్నాయి. కర్నూలు మండలం, రేమటకు చెందిన చిన్న గిడ్డయ్య నాయుడు వృషభాలు 4706 అడుగులు లాగి రూ.40 వేలు, తెలంగాణ రాష్ట్రం కొత్తకోటకు చెందిన డాక్టర్ గుర్నాథ్, నందికొట్కూరు మండలం, మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమున్నా (విడిజత) వృషభాలు 4609 అడుగులు లాగి రూ.30 వేలు, నంద్యాల మండలం, పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 4500 అడుగులు లాగి రూ.20 వేలు గెలుపొందాయి. అలాగే నాగర్‌కర్నూలు జిల్లా, పెద్ద కొత్తపల్లె మండలం, చంద్రకల్‌కు చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు 4496 అడుగులు లాగి రూ.10 వేలు, జక్కిలేరుకు చెందిన డాక్టర్ రషీద్, గొల్లపల్లెకు చెందిన వారాది రామ్‌చరణ్ (విడి జత) వృషభాలు 3947 అడుగులు లాగి రూ.5 వేలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు వాడాల రామానాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సిమెంట్ లారీ బోల్తా


బోల్తా పడిన సిమెంట్ లారీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని బేతంచర్ల మార్గంలో ఆదివారం తెల్లవారుజామున సిమెంట్ లోడుతో వెళ్తున్న ఐచర్ లారీ బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు.. దాల్మియా సిమెంట్ లోడుతో కర్నూలు వైపు ఐచర్ లారీ వెళుతోంది. బనగానపల్లె ఎండీహెచ్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫోర్‌లైన్ డివైడర్‌ను వేగంగా ఢీకొని బోల్తాపడింది. సిమెంట్ బస్తాలన్నీ రోడ్డుపై పడ్డాయి. అయితే ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ నూర్ అహ్మద్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ ప్రవీణ్‌కుమార్ జేసీబీతో వాహనాన్ని పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో కూడా ఈ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని.. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన మ్యాజిక్ షో


మ్యాజిక్ షో నిర్వహిస్తున్న సుధీర్ రాజు, చిత్రంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ పోగ్రామ్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన మ్యాజిక్ షో అలరించింది. డ్రాయింగ్ మాస్టర్ సుధీర్ రాజు తన మ్యాజిక్‌తో విద్యార్థులను అబ్బురపరిచారు. రీసోర్స్ పర్సన్‌లు హిందీ ఉపాధ్యాయిని చాంద్‌బీ హిందీ ఎలా మాట్లాడాలి, ఉపాధ్యాయులు యాంగటీశ్వరప్ప ఆహారపు అలవాట్లు, అనారోగ్య సమస్యలు, ఉపాధ్యాయిని ఇందుమతి ధ్యానం గురించి, రవికిరణ్‌రెడ్డి కథలు చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ పాల్గొని ప్రసంగించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న షేక్ మహమ్మద్ ఇలియాస్

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీగా నియమితులైన షేక్ యూనిస్ బాష ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. పదవులు పొందిన వారందరూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి


తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): తైక్వాండోలో రాణించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. ఆదివారం స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మతో కలిసి కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పట్టు వదలని క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండేందుకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందన్నారు. కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు


రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు


దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ 37, 41వ వార్డుల్లో విస్తరించిన వీకర్‌సెక్షన్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. కోడుమూరు రోడ్డులోని బీడీ వర్కర్ల కాలనీలో రోడ్డు మధ్యలో నెర్రలిచ్చింది. అలాగే 41వ వార్డులోని వీకర్‌సెక్షన్ కాలనీలో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఆయా రోడ్లపై ఎక్కువగా మధ్య తరగతి ప్రజలు వివిధ జీవనోపాధుల నిమిత్తం ప్రయాణిస్తుంటారు. దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు ఏ మాత్రం అదుపు తప్పినా కింద పడి గాయాలపాలవ్వాల్సిందేనని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

చల్లని కబుర్లు..!


చెట్టు నీడన క్రికెట్ ఆడుతున్న పిల్లలు

కర్నూలు(రూరల్): పల్లెల్లో రచ్చబండలపై సేదతీరితే ఆ అనుభూతి ఎంతో బాగుంటుంది. ఇది పల్లె ప్రజల జీవనశైలిలో ఒక భాగం. ఇప్పుడైతే టీవీలు, సెల్‌ఫోన్లతో గడిపేస్తున్నారు గానీ గతంలో అరుగులపై కూర్చొని ఒకరికొకరు కష్ట సుఖాలు, మంచి చెడులు మాట్లాడుకుంటూ గడిపేవారు. గ్రామాల్లో చెట్ల నీడలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటే ఆ మజానా వేరు. ప్రస్తుతం వేసవి కావడంతో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఉపశమనం కోసం గ్రామస్తులు రచ్చబండలపైకి చేరుతున్నారు. చల్లని గాలిని ఆస్వాదిస్తూ సేద తీరుతున్నారు. ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు ఉన్నా చెట్ల కింద వచ్చే గాలి హాయే వేరుగా ఉంటుందని పేర్కొంటున్నారు. నగర సమీపంలోని సుంకులమ్మ ఆలయ సమీపంలో ఉన్న రచ్చబండపై మర్రిచెట్టు కింద వృద్ధులు, యవకులు ఆదివారం సేదతీరుతూ.. కబుర్లు చెప్పుకుంటూ గత కాలాన్ని గుర్తు చేశారు.


మర్రిచెట్టు కింద కబుర్లు చెప్పుకుంటున్న వృద్ధులు, యువకులు